# ‘రుతుప్రేమ’ దేశానికే ఆదర్శం


సిద్దిపేటలో రుతుప్రేమ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

- సంపూర్ణ స్వచ్ఛ, ఆరోగ్య సిద్దిపేటనే లక్ష్యం
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- రుతుప్రేమ యాప్ ప్రారంభోత్సవం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 5 : రుతుప్రేమ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిపోనున్నదని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జరిగిన రుతుప్రేమ యాప్ ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సీపీ శ్వేత, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సెట్విల్ ఆధ్వర్యంలో 200 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణ, శుభ్రమైన సిద్దిపేట కోసం రుతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టి నియోజకవర్గంలో పూర్తిచేశామన్నారు. మానవ మనుగడను శాసించేది రుతుచక్రమని, రుతుచక్రం లేకుంటే జీవన చక్రమే లేదన్నారు. సంపూర్ణ స్వచ్ఛ ఆరోగ్య సిద్దిపేటనే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సామాజిక మార్పు కోసం, తన వంతు బాధ్యతగా ఏమీ ఆశించకుండా డాక్టర్ శాంతి చేస్తున్న సేవలను మంత్రి కొనియాడారు. రూ.1.53 కోట్లు వెచ్చించి నియోజకవర్గ పరిధిలోని 53వేల మంది మహిళలకు మెన్‌స్ట్రువల్ కప్పులు అందించినట్లు తెలిపారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు 100 మందికి ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరో 900 మందికి ల్యాప్‌టాప్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ 2021లో ప్రారంభమైన రుతుప్రేమ కార్యక్రమం సిద్దిపేట నియోజకవర్గంలోని 91 పంచాతీయలు, అన్ని మున్సిపల్ వార్డుల్లో లక్షా 33వేల మందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. 53,067 మంది మహిళలకు రుతుప్రేమ మెన్‌స్ట్రువల్ కప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, డీపీవో దేవకీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ సరోజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు


ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

# మిట్టపల్లి ఓట్లతో సత్తా చాటాలి

**మిట్టపల్లి గ్రామ కుల సంఘ భవనాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన మంత్రి**

సిద్దిపేట, అక్టోబర్ 5 : ‘మిట్టపల్లి గ్రామం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిందని, అదేస్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో రాష్ట్ర స్థాయిలో ఓట్లతో సత్తా చూపాలి.. కుల సంఘ భవనాలు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని, పనిచేసే ప్రభుత్వాన్ని దీవించాలని, సద్దితిన్న రేవు తలవాలి’ అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కుల సంఘ భవనాలకు మంత్రి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ముదిరాజ్ సంఘానికి రూ.40 లక్షలు, యాదవ సంఘం రూ.50 లక్షలు, గౌడ సంఘం రూ.30 లక్షలు, వడ్డెర సంఘం రూ.20 లక్షలు, ఎస్సీ మాదిగ సంఘం రూ.30లక్షలు, ఎస్సీ మాల సంఘం మిగులు పనులకు రూ.12లక్షలు నిధులు మంజూరు చేస్తూ.. ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం తన కుటుంబంలా భావించి అందరికీ సేవ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాసేవలో సిద్దిపేటను అన్నింటా ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిద్దిపేట ఖ్యాతిని పెంచామని, ఆ సేవను ప్రజానీకం గుర్తించాలని కోరారు. మిట్టపల్లి నుంచి సిద్దిపేట వరకూ నాలుగు లేన్ల రహదారి వస్తున్నదని, హైటెక్ సిటీగా మారిందన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి

సిద్దిపేట, అక్టోబర్ 5 : సిద్దిపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. అంతకు ముందు పట్టణ సమీకృత మార్కెట్‌లో మేక, గొర్రెల కాళ్లు, తలకాయలు శుభ్రపర్చు కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ నూతన భవనం, గోదాంను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజితావేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, ఏఎంసీ వైస్ చైర్మన్ గంప రామ్‌చందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజేందర్, మురంశెట్టి సంతోష్, సత్యంరెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, కనకయ్య పాల్గొన్నారు.


మేక, గొర్రెల కాళ్లు, తలకాయలు శుభ్రపర్చు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

# గల్లీస్థాయి లీడర్‌లా మాట్లాడుతున్న ప్రధాని మోదీ



చేర్యాలలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

- ఆడబిడ్డల ఆత్మీయబంధువు సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- చేర్యాలలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ
- యువకులకు స్పోర్ట్స్ కిట్లు అందజేత

చేర్యాల, అక్టోబర్ 5: ప్రధాని నరేంద్రమోదీ గల్లీస్థాయి లీడర్‌లా మాట్లాడడం విడ్డూరంగా ఉందని, ఇన్నిరోజులు ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించిన బీజేపీ నేతలు రాష్ట్రంలోని దేవుళ్లకు ఐటీ తాఖీదులు ఇచ్చి తమ దైవభక్తిని చాటుకున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎద్దేవా చేశారు. చేర్యాలలోని పీఎంఆర్ గార్డెన్స్‌లో గురువారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ బంధువన్నారు. తెలంగాణ దేశంలో నంబర్‌వన్ కావడంతో మోదీకి మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. తెలంగాణ ఆడబిడ్డపై తప్పు డు కేసులు పెట్టిన బీజేపీ నేతలకు పుట్టగతులు ఉండవన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు ఇచ్చి జైలుకు వెళ్లారని, ఇప్పుడు సీటుకు నోటు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చేర్యాల పట్టణంలోని వైశ్య సామాజిక వర్గానికి చెందిన వైకుంఠధామానికి రూ.10లక్షలు, చేర్యాల గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎం పీపీలు బద్దిపగిగె కృష్ణారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, తలారీ కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్‌చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఏకానందం, వైస్ ఎంపీపీలు నవీన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అమల్లేశం, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

కొమురవెల్లి, అక్టోబర్ 5 : తల్లిదండ్రులు చేసే పనిలో మనం సాయం కావడమే ఫ్యాషన్ అని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం కొమురవెల్లిలోని పాత కమాన్ వద్ద రూ.3.56కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఎంపీపీ కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్పతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో ముచ్చటించారు. నేటి సమాజంతో ఫ్యాషన్ పేరుతో వేషధారణ పూర్తిగా మారుస్తున్నారని, తమ కోసం కష్టపడే తల్లిదండ్రులకు వారు పనిలో సాయం చేయడమే నిజమైన ఫ్యాషన్ అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ సార్ల లత, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాస్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నీరజ, సర్పంచులు బీమనపల్లి కరుణాకర్, పచ్చిమండ్ల స్వామిగౌడ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు మహేశ్, బీఆర్‌ఎస్వై మండలాధ్యక్షుడు బూరుగు స్వామిగౌడ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొమురవెల్లిలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

# బీజేపీ గుండాలను అరెస్ట్ చేయాలి


సీపీ శ్వేతకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 5 : రైలు ప్రారంభోత్సవంలో తమపై దాడికి పాల్పడిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో పాటు బీజేపీ గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీ శ్వేతకు బీఆర్‌ఎస్ శ్రేణులు బుధవారం ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మేరుగు మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్ నాయిని చంద్రం, నాయకులు సాకి ఆనంద్, జువ్వన్న కనకరాజుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3న జరిగిన రైలు ప్రారంభోత్సవానికి సిద్దిపేట ప్రాంత యువకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై సంబురాలు చేస్తుంటే.. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీకి చెందిన కొంతమంది గూండాలు అరాచకం సృష్టించారని, ఎమ్మెల్యేతో పాటు బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, సోషన్ మీడియా కన్వీనర్ గుడిమల్ల రాజలింగం, నాయకులు రమేశ్, మహేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380
★ Wanted Civil Engineer (Narayankhed Project) Mechanical Engineer (Sadsivpet, Factory) Mobile: 9346349908. Mail: expeeengineeringhr@gmail.com
NT-318387